క్లుప్తంగా

సీతారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

తుక్కుగూడ: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలక మండలి సభ్యురాలుగా చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి ఎంపీక కావడం పట్ల తుక్కుగూడ బీఆర్‌ఎస్ నాయకులు బోధ జైపాల్ రెడ్డి బుధవారం ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాఘవేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ప్రహ్లాద్‌రెడ్డి, యాదగిరిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగంగా చెత్త వేస్తే చర్యలు తప్పవు



బహిరంగంగా చెత్త వేసిన వ్యక్తికి చలాన్ రశీదు ఇస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్

తుర్కయంజాల్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు. ఇంటింటికి చెత్తను సేకరించడానికి వచ్చే స్వచ్ఛ ఆటోలకు చెత్త అందజేయాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేసి పరిసరాలను అపరిశుభ్రంగా తయారు చేయొద్దన్నారు. బహిరంగంగా చెత్త వేస్తే రూ.500 నుంచి 10వేల వరకు జరిమానా వేస్తామని ఆయన తెలిపారు. బుధవారం మాసబ్ చెరువులో చెత్త వేయడానికి ప్రయత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులకు రూ. 500 చొప్పున చలానా విధించి, తిరిగి వారితోనే చెత్తను ఎత్తించారన్నారు. పుర స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, జవాన్లు శివ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చట్ట సభల్లో అవకాశం కల్పించాలని ర్యాలీ



ఇబ్రహీంపట్నంలో ముదిరాజ్ కులస్తుల ర్యాలీ

ఇబ్రహీంపట్నం: చట్ట సభల్లో ముదిరాజ్ కులస్తులకు అవకాశం కల్పించాలని సంఘం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ముదిరాజ్‌లకు ప్రాధాన్యత కల్పించని పార్టీలకు రానున్న ఎన్నికల్లో తగిన రీతిలో గుణపాఠం చెబుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బి మల్లేశ్, నియోజకవర్గ అధ్యక్షుడు బిక్షపతి, జలమోని రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధులు సోకకుండా చర్యలు



ఉప్పరిగూడలో పశువు వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం రూరల్: పశువులకు వ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడ గ్రామంలో పశువులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 100 పశువులకు గర్భకోశ, సాధారణ చికిత్సలు చేశారు. అనంతరం బూడిద రాంరెడ్డి మాట్లాడుతూ పశువులకు సకాలంలో చికిత్సలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఎల్డీఏ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రవణ్ కుమార్, వీఏఎస్‌లు డాక్టర్ సురేందర్, సురేష్ బాబు, జేవీఓ ప్రసూన, గోపాల మిత్రలు జగన్, నర్సింహా, అరుణ, మానస తదితరులు పాల్గొన్నారు.

మైసిగండిలో తీజ్ సంబరం



తీజ్ వేడుకలో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

కడ్తాల్: గిరిజన సంప్రదాయానికి ప్రతీక తీజ్ అని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ నారాయణరెడ్డి, బీజేపీ నేత ఆచారి, కాంగ్రెస్ నేతలు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్‌రెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్ నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, సర్పంచ్ తులసీరాంనాయక్ అన్నారు. మైసిగండి గ్రామంలో నిర్వహించిన వేడుకలకు వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, ఉప సర్పంచ్ రాజారామ్, రెడ్యానాయక్, ఎంపీడీవో రామకృష్ణ, భాస్కర్, రెడ్యానాయక్, మోత్యానాయక్, జవహర్‌నాయక్, పాండునాయక్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

అన్నా చెల్లెల ‘రక్షా’బంధం

అన్నతమ్ముళ్ల, అక్కాచెల్లెళ్ల ప్రేమానుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ జరుపుకుంటారు. సోదరులు తమకు రక్షగా ఉండాలని ఎల్లప్పుడు సుఖసంతోషాలతో వారు జీవించాలని భగవంతుడిని వేడుకుంటూ సోదరీమణులు రాఖీ కడతారు. వారికి ఎల్లవేళలా బాసటగా నిలుస్తామని అన్నదమ్ముళ్లు భరోసా కల్పించడమే రక్షాబంధన్. గురువారం రాఖీ సందర్భంగా మండలంలో వెలసిన రాఖీ దుకాణాలు, మిఠాయిల కొనుగోళ్ల వద్ద మహిళలు సందడి చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



హుడాకాంప్లెక్స్: అన్నకు రాఖీ కడుతున్న రాజేశ్వరి



కందుకూరు చౌరస్తాలో రాఖీ కొనుగోలు చేస్తున్న మహిళ



బడంగ్‌పేటలోని లార్డ్స్ స్కూల్లో రాఖీ వేడుకలో చిన్నారులు



మీర్‌పేట: లార్డ్స్ పాఠశాలలో రాఖీ కడుతున్న విద్యార్థినులు



బడంగ్‌పేట్: రాఖీ దుకాణం వద్ద మహిళల సందడి

ఆర్యవైశ్య భవన్‌కు స్థలం కేటాయించండి

మీర్‌పేట: ఆర్యవైశ్య సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ బుధవారం బాలాపూర్ మండల సంఘం ప్రతినిధులు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ ట్రస్ట్ చైర్మన్ తెరేటిపల్లి శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ మహేశ్వరం బీఆర్‌ఎస్ టికెట్‌ను మంత్రికి కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో మంత్రి గెలుపునకు కృషి చేస్తామని సంఘం ప్రతినిధులు అన్నారు. అనంతరం మంత్రి స్పందిస్తూ సంఘం భవనానికి స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శి ఇరువెంటి సురేష్‌గుప్తా, కోశాధికారి గందే వెంకటేశ్వర్లుగుప్తా పాల్గొన్నారు.



మంత్రి సబితారెడ్డికి బొకె అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

మర్రి జనార్దన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

ఆమనగల్లు: తెలకపల్లి మండలంలో కాంగ్రెస్ నాయకులను పిస్టల్‌తో కాల్చివేస్తానని బెదిరించిన నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కల్వకుర్తి నియోజక వర్గ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌లో యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి మర్రి జనార్దన్‌రెడ్డిపై ఎస్‌ఐ బాల్‌రాంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో కాల్చివేస్తానని బెదిరింపులకు పాల్పడడం బాధాకరమన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యేను చట్ట పరంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్, కల్వకుర్తి తాలుకా కార్యదర్శి అలీ, జంగయ్యగౌడ్, కృష్ణ యాదవ్, మహేశ్, సురేశ్, రాజు, జంతుక మహేశ్, వస్పుల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికార వాటా సాధనే లక్ష్యంగా సభ

హుడాకాంప్లెక్స్: పద్మశాలి సమాజ సంక్షేమం, అభివృద్ధి రాజ్యాధికార వాటా సాధనే లక్ష్యంగా నిర్వహిస్తున్న ‘పద్మశాలి శంఖారావ’ సభను విజయవంతం చేయాలని ఎల్‌బీనగర్ సర్కిల్ పద్మశాలి మహిళా అధ్యక్షురాలు రావిరాల సంధ్యారాణి పిలుపునిచ్చారు. బుధవారం సరూర్‌నగర్ మండల కేంద్రం కొత్తపేట, హుడాకాంప్లెక్స్, కృష్ణాపురంలలో పద్మశాలి శంఖారావం ఆహ్వాన పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రాంగణంలో సెప్టెంబరు 3న జరిగే పద్మశాలి శంఖారావంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో భారతమ్మ, చంద్రకళ, చిలుకూరి మాధవి, కర్నాటి మాధవి, ఉమా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రాలను అందజేస్తున్న సంధ్యారాణి, తదితరులు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి

పహాడీషరీఫ్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ బి వెంకట్ రెడ్డి అన్నారు. షాహీన్‌నగర్‌లోని ఓఎస్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకింగ్ వివరాలను అపరిచితులకు చెప్పొద్దన్నారు. ఫోన్లో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించొద్దన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. ఇటీవల కాలంలో మహిళలు, విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని గుర్తు చేశారు. సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి డబ్బులు కాజేస్తున్నారన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు నడిపేవారు కొత్త వ్యక్తుల మాటలు నమ్మొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వెంకట్ రెడ్డి

వంటగ్యాస్ ధర తగ్గించడంపై హర్షం

హుడాకాంప్లెక్స్: పేద, మధ్య తరగతి కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.200 తగ్గించి మంచి నిర్ణయం తీసుకున్న ప్రధాని నరేంద్రమోదీకి కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం సరూర్‌నగర్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద ప్రధాని చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: సిలిండర్ ధర తగ్గించడం హర్షణీయమని మీర్‌పేట కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ తెలిపారు. మహిళా మోర్చా నాయకురాలు రజిని, వేణుగోపాల్‌రెడ్డి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన ప్రధాన కార్యదర్శి గాజుల మధు, సూల ప్రభాకర్, యాదగిరి యాదవ్, బెల్లంకొండ నాగరాజు, తదితరుల పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం పురోగమిస్తుందని ఎంపీపీ మంద జ్యోతిపాండు, కొత్తగూడ సర్పంచ్ సాధ మల్లారెడ్డి తెలిపారు. మండల ప్రధానకార్యదర్శి నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దళిత మోర్చా రాష్ట్ర నాయకుడు మంద పాండు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు నల్లబోలు నరసింహారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సోమరాజు వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేటలో..

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్ చౌరస్తాలో బీజేపీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ క్షీరాభిషేకం నిర్వహించారు.



సరూర్‌నగర్‌లో ప్రధాని చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి



మీర్‌పేటలో హర్షం వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు



కందుకూరు చౌరస్తాలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ, బీజేపీ నాయకులు



బడంగ్‌పేటలో మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం

గీత కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఇబ్రహీంపట్నం: సాయం అందజేస్తున్న నేతలు

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామానికి చెందిన గీత కార్మికుడు అబ్బయ్యగౌడ్ ఇటీవల తాటిచెట్టుపై నుంచి కిందపడి మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబానికి చరికొండ గ్రామ గౌడ సంఘం రూ.32 వేలు, ఎంపీటీసీ రాములుగౌడ్ రూ.5 వేలు, అద్దాల జగాల్ రూ.2 వేలు, లాలికోట జంగయ్య రూ.2 వేలు, లాలికోట శ్రీను రూ. ఒక వెయ్యి సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారతమ్మ నర్సింహగౌడ్, ఎంపీటీసీ అద్దాలరాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సాయం అందజేత

ఇబ్రహీంపట్నం: పేదరికం చదువుకు అడ్డుకావద్దని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్ ఆర్థిక సాయం అందజేశారు. ఎంబీబీఎస్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన మేఘన 11 వేల ర్యాంకు సాధించి సీటు దక్కించుకుంది. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించాలన్నారు. సంఘం నాయకులు ఎం రాజు, చంద్రశేఖర్, ఆనంద్, హరి ప్రసాద్, జమీర్, గోపాల్‌నాయక్‌లు పాల్గొన్నారు.

గోలి శ్రీనివాస్‌రెడ్డికి అభినందనల వెల్లువ

కడ్తాల్: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు బొకె అందజేసి పలువురు నాయకులు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి అంకిత భావంతో పనిచేసే వారికి తగిన గౌరవం, గుర్తింపు ఇస్తుందనడానికి ఇదీ నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, చందోజీ, జహంగీర్‌అలీ, సర్పంచ్ సులోచన, సాయిలు, ముత్తికృష్ణ, జంగయ్యగౌడ్, మహేశ్‌గౌడ్, నర్సింహ పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలిపిన వెంకటేశ్‌గుప్తా

ఆమనగల్లులో..

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, మాజీ చేనేత సంఘం అధ్యక్షుడు కోట కృష్ణయ్య, కసిరెడ్డి సాయినాద్‌రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సత్కరించారు.

19వరకు ఓటరు జాబితా సవరణకు అవకాశం



మాట్లాడుతున్న ఆర్డీవో అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం: ఓటర్ జాబితాలో సవరణకు సెప్టెంబర్ 19వ వరకు అవకాశం ఉందని ఆర్డీవో అనంతరెడ్డి తెలిపారు. వివిధ రాజకీయపక్షాల ప్రతినిధులతో బుధవారం ఇబ్రహీంపట్నంలోని ఆర్డీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి కొత్త ఓటర్ల జాబితాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పక్షాలకు అందజేసిన ఓటర్ల జాబితాను క్షుణంగా పరిశీలించి సలహాలు, సూచనలు తెలియజేయాలని కోరారు. ఎన్నికల సంఘం ఆదేశానుసారం ప్రతి బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ యశ్వంత్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



తుర్కయంజాల్: ఎమ్మెల్యేతో కాలనీల వాసులు

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తానని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ భాగ్యనగర్ కాలనీలో అంతర్గత మురుగు కాలువల నిర్మాణానికి రూ.1.60 కోట్లను మంజూరుచేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధికి రాజీలేకుండా కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కాలనీవాసులు ఘనంగా సన్మానించారు.

తుర్కయంజాల్: సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయ సహకారం అందిస్తానని మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. తుర్కయంజాల్‌లో పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మాజీ సర్పంచ్ చెవుల దశరథ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ

హస్తినాపురం: రోజురోజుకూ పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పెంచి పెద్దచేసినట్లెతై పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ రోడ్డులోని దేవకమ్మతోట కాలనీలో కార్పొరేటర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సుజాతనాయక్ మాట్లాడుతూ... మొక్కలను పెంచితే సమృద్ధిగా వర్షాలు కురుస్తాయన్నారు. భవిష్యత్‌తరాలకు ప్రాణవాయువు సమృద్ధిగా లభిస్తుందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు రాజుగౌడ్, గొడ్డలి కృష్ణ, దయ్యాల వెంకటేశ్, మమతా మల్లేశ్‌గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పండాల రాజశేఖర్‌గౌడ్, మర్యాద రోహిత్ రెడ్డి, లోకసాని హరీ ష్‌రెడ్డి, ప్రశాంత్, మహేశ్, శరత్, ఉమేశ్, ధర్వేశ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


హస్తినాపురం: నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే లక్ష్యంగా పటిష్ఠ చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం హస్తినాపురం డివిజన్ జయకృష్ణ ఎన్‌క్లేవ్ కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా చర్యలు తీసుకున్నామన్నారు. తాను ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ నెరవేర్చానని అన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణ, జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దేవిరెడ్డి కమలా సుధీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు సత్యంచారి, హనుమాన్ టెంపుల్ ధర్మకర్తలు శ్రీనివాస్‌యాదవ్, కళ్యాన్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, పాల్గొన్నారు.

అద్దెకు తీసుకున్న కార్ల తాకట్టు

- నిందితుడి సహా తాకట్టు దారుడి అరెస్టు
- 10 కార్ల స్వాధీనం.. పరారీలో మరో వ్యక్తి

హస్తినాపురం: కార్లను వాటి యజమానుల దగ్గర అద్దెకు తీసుకుని నెలనెల కిరాయి డబ్బులు ఇవ్వకుండా ఏకంగా అద్దెకు తీసుకున్న కార్లనే వేరేవ్యక్తి దగ్గర తాకట్టు పెట్టిన వ్యక్తిని, తాకట్టు పెట్టుకున్న మరో వ్యక్తిని వనస్థలిపురం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేప జలేంధర్‌రెడ్డి సమాచారం మేరకు... రంగారెడ్డి జిల్లా మంచాల మండలం లోయపల్లి గ్రామానికి చెందిన బట్టు జానయ్య చింతల్‌కుంటలో నివాసం ఉంటూ కారును సెల్ఫ్ డ్రైవింగ్‌కు ఇచ్చే వ్యక్తికి అద్దెకు ఇస్తుంటాడు. కాగా కర్మన్‌ఘాట్ దుర్గాకాలనీకి చెందిన నాగరాజు(34) బైరామల్‌గూడలో శివప్రకాశ్ ట్రావెల్స్ అనే సెల్ఫ్ డ్రైవింగ్ బిజినెస్ చేస్తూ సుమారు 10 మంది దగ్గర కార్లను అద్దెకు తీసుకుని సెల్ఫ్ డ్రైవింగ్ వ్యాపారం చేస్తూ యజమానులకు ప్రతినెలా కిరాయి డబ్బులు ఇస్తుండేవాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో నాగరాజు ఐపీఎల్‌లో బెట్టింగులు పెట్టి డబ్బులు పోగొట్టుకున్నాడని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నాగరాజు ఇతరుల దగ్గర కిరాయికి తీసుకున్న కార్లని వడ్డీ వ్యాపారం చేసే సూర్యాపేట జిల్లా బేతవోలు గ్రామానికి చెందిన బెక్కం వెంకటేశ్(29) దగ్గర 10 శాతం వడ్డీ లెక్కన డబ్బులను తీసుకుని పెద్దఎత్తున కార్లను తాకట్టు పెట్టాడు. ఇలా కార్ల యజమానులను మోసం చేస్తూ తప్పించుకుని తిరుగుతున్నాడని తెలుసుకొని నాగరాజును అదుపులోకి తీసుకుని విచారించగా తాను చేసిన తప్పును ఒప్పుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నాగరాజు, వెంకటేశ్‌ను అరెస్ట్ చేసి వారి నుంచి 10 కార్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో నిందితుడు రామారావు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.





నిందితులు నాగరాజు, వెంకటేశ్